క్లుప్తంగా

'సిద్ధం సభ'ను విజయవంతం చేయాలి



కలిగిరిలో సిద్ధం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కలిగిరి: బాపట్ల జిల్లా మేదరమెట్లలో ఆదివారం నిర్వహించే సిద్ధం సభకు భారీగా తరలివెళ్లి విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కాటం రవీంద్రారెడ్డి శనివారం తెలిపారు. ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని 23 పంచాయతీల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా రావాలన్నారు. కలిగిరిలో ఉపసర్పంచ్ పాలూరు కొండారెడ్డి సిద్ధం పోస్టర్లను ఆవిష్కరించారు.

పలువురికి ఆర్థిక సాయం అందజేత



మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం చెక్కు కంచి పరమేశ్వర రెడ్డి, తదితరులు

ఆత్మకూరు: పట్టణంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలకు రూ.10 వేలు శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి శనివారం ఆర్థిక సాయం అందజేశారు. 10వ వార్డు పరిధిలోని వావిచర్ల సీతామహాలక్ష్మి, 7వ వార్డు పరిధిలోని షేక్ ఇంతియాజ్, 13 వార్డు పరిధిలోని రాపూరు వెంకటేశ్వర్లు, 22వ వార్డు పరిధిలోని జ్యోతినగర్‌కు చెందిన కె రామ్‌కుమార్, 23వ వార్డు పరిధిలోని బీసీకాలనీలో పులివెందల రమణమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆయా కుటుంబ సభ్యులకు ట్రస్ట్ నిర్వాహకుడు పరమేశ్వరరెడ్డి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తుమ్మల త్రివేణి, కామాక్షయ్యనాయుడు, మెప్మా ఆర్పీలు వెంకట సుబ్బమ్మ, శిరీషా, సుభాషిణి, జబీనా, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, దోర్నాదుల సురేష్‌బాబు, హజరత్తయ్య, పి సత్యం తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఫిట్‌నెస్ రన్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మర్రిపాడు: జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక కేజీబీవీలో శనివారం నెల్లూరు జిల్లా యువ కేంద్రం సౌజన్యంతో విద్యార్థులకు 500 మీటర్ల పరుగు పందెం నిర్వహించారు. ప్రతి విద్యార్థి శారీరకమైన ఫిట్‌నెస్‌తో ఉండాలనే నినాదంతో ఫిట్ నారీ శక్తి కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ లక్ష్మీదేవి, పీఈటీ బి పద్మావతమ్మ చెప్పారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్రైడ్ సంస్థ అధ్యక్షుడు వాగాల శ్రీహరి, కెనరా బ్యాంకు ఆఫీసర్ టీ కోనయ్య, నారీ శక్తి తదితరులు పాల్గొని విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం వలంటీర్లు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేజీబీవీలో నారీశక్తి సదస్సు

కలిగిరి: స్థానిక కేజీబీవీలో ప్రజాసత్తా ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్రం సహకారంలో నారీ శక్తి సదస్సు శనివారం నిర్వహించారు. ఎంఈఓ సురేష్‌బాబు మాట్లాడుతూ మహిళలు శారీరకంగా, మానసికంగా ధృఢత్వం కలిగి ఉండాలన్నారు. విద్యార్థినులకు 500 మీటర్ల పరుగు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసత్తా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పులగర శోభన్‌బాబు, ప్రిన్సిపల్ సుప్రియ, పీఈటీ స్పందన తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నారీశక్తి

అనుమసముద్రంపేట: స్థానిక కేజీబీవీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవా వారోత్సవాల్లో భాగంగా శనివారం నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్, యూత్ ఆఫీసర్ మహేంద్రరెడ్డి సహకారంతో హెడ్స్ సంస్థ డైరెక్టర్ వెలగపాటి వెంకటేశ్వర్లు నారీ శక్తి నిర్వహించారు. బాలికలు ఉత్సాహంగా 500 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్నారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు.

మర్యాదపూర్వకంగా



ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని శనివారం నెల్లూరులోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరిస్తున్న ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి

ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ ఆఫర్

- కట్టే వారికే కాకుండా కట్టిన వారికి వర్తింపు

కావలి: కావలి మున్సిపాలిటీ పరిధిలో గృహ, ఖాళీ స్థలాలకు సంబంధించి ఆస్తి పన్నుల బకాయిదారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఈనెల 31లోగా పన్ను చెల్లిస్తే వడ్డీ పూర్తిగా మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వ నిర్ణయంతో పట్టణంలోని సాధారణ ప్రజలతో పాటు వ్యాపారులకు ఊరట లభించింది. పట్టణంలోని నివాసాలు, వాణిజ్య భవనాలకు మున్సిపాలిటీ ఆస్తి పన్ను వసూలు చేస్తోంది. వేలాది మంది ఆస్తి పన్ను చెల్లించకపోవడంతో బకాయిలపై వడ్డీ భారీగా పెరిగిపోతోంది. పదేళ్ల పాటు ఆస్తి పన్ను చెల్లించకపోతే వడ్డీతో కలిపి రెండింతలు అవుతుంది. అసలు, వడ్డీ చెల్లింపులు భవన యజమానులకు భారంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వన్ టైం సెటిల్మెంట్ (ఓటీఎస్)ను తీసుకొచ్చింది. గత ఆర్థిక సంవత్సరం ముగింపులోనూ వడ్డీ మాఫీ ప్రకటించిన ప్రభుత్వం, వరుసగా రెండో ఏడాది ఈ 2023–24లో బంపర్ ఆఫర్ ఇచ్చింది. పట్టణాల్లో ఆస్తి పన్ను బకాయిలకు వడ్డీ మాఫీ వర్తించాలంటే బకాయిలతో సహా మొత్తం ఒకేసారి చెల్లించాల్సి ఉంటుంది.

పన్నుల వసూళ్లకు ప్రత్యేక చర్యలు

ఆస్తి పన్ను బకాయిల వసూలుకు కావలి మున్సిపాలిటీ రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇంటింటికి వెళ్లి పన్ను వసూలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఎక్కువ పన్ను బకాయిలున్న భవన యజమానుల వద్దకు వెళ్లి వారికి ప్రభుత్వం ఇచ్చిన ఆఫర్‌ను వివరిస్తున్నారు. మరో వైపు వార్డు సచివాలయాల్లో, ఆన్‌లైన్‌లో ఆస్తి పన్నులు చెల్లించే అవకాశం కల్పించారు. వడ్డీ రాయితీ ప్రకటించడంతో బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. కావలి పురపాలక సంఘ పరిధిలో మొత్తం 25,318 అసెస్మెంట్లు ఉన్నాయి. ఆస్తి పన్ను బకాయిలపై విధించిన వడ్డీ మాఫీపై కావలి పురపాలక సంఘంలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఆస్తి పన్ను బకాయిలు, వాటికి సంబంధించిన వడ్డీ నమోదై ఉంది. బకాయిదారులు ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తే దానంతటదే వడ్డీ మాఫీ తీసుకునేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు.



పన్ను రాయితీపై పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రచార హోర్డింగ్

ప్రైవేట్ భవనాలు	- 25,246
ప్రభుత్వ భవనాలు	- 72
ఖాళీ స్థలాలు	- 1,569
పాత బకాయిలు	- రూ.3,75,40,685
కొత్త బకాయిలు	- రూ.7,94,46,015

కట్టేసిన వారికి వచ్చే పన్నుల్లో తగ్గింపు

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే భవనా లు, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించిన వారికి కూడా మేలు చేకూరేలా ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇప్పటికే ఆస్తి పన్నులు చెల్లించిన వారు ఎంత చెల్లించారో వడ్డీ లెక్కగట్టి వచ్చే ఏడాది ఆస్తి పన్నులో ఆ మొత్తాన్ని తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నారు.

మంచి వెసులుబాటు

ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ మాఫీ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఈ నెలాఖరులోగా భవన, ఖాళీ స్థలాల ఆస్తి పన్ను మొత్తం చెల్లించి సహకరించాలి. ప్రజలంపై భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

– శ్రావణ్‌కుమార్

రాజకీయ రంగు పూయడం సబబు కాదు



మాట్లాడుతున్న జువ్వలదిన్నె గ్రామస్తులు

కావలి: గ్రామస్తుల కోసం నిర్మిస్తున్న రోడ్డు పనులను అడ్డుకోవడంతో గ్రామంలో జరిగిన వివాదానికి రాజకీయాలు పులమడం తగదని బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామస్తులు చెప్పారు. కావలిలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో గ్రామస్తులు పిడుగు వీరప్రసాద్, కిరణ్, దుగ్గిరాల చిన్న, పిడుగు శ్రీను, పచ్చా రమేష్, పెనుకొండయ్య, వెంకట్రావు, దాసరి హనుక్ మాట్లాడారు. జువ్వలదిన్నె ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు మంజూరు కావడంతో ఎన్నికల కోడ్ వస్తుందని త్వరగా రోడ్డు నిర్మాణ పను లు చేసుకోవాలని శుక్రవారం జేసీబీతో పనులు చేస్తుంటే తమ గ్రామానికే చెందిన వీఆర్‌ఏ దుగ్గిరాల పెనుగొండయ్య, అతని భార్య అడ్డుకున్నారన్నారు. దీంతో గ్రామంలోని 60 కుటుంబాలకు చెందిన మహిళలు, గ్రామస్తులు అక్కడికి చేరుకొని పెనుగొండయ్య భార్యను పక్కకు తీసుకువెళ్లేందుకు ప్రయత్నించగా మహిళల మధ్య పెనుగులాట జరిగిందన్నారు. పెనుకొండయ్య తన అనుచరులతో రాళ్లువిసరడంతో గ్రామస్తులకు గాయాలయ్యాయన్నారు. అయితే కొన్ని మీడియాలు, సోషల్ మీడియాల్లో వైఎస్సార్‌సీపీ ఈ దాడి చేయించారని, అసత్యాలు ప్రచురించారన్నారు.

'సిద్ధం' సభతో ప్రతిపక్షాల్లో వణుకు

- కావలి నియోజకవర్గం నుంచి తరలుతున్న భారీగా అభిమానులు, కార్యకర్తలు
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి

కావలి: బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద ఆదివారం నిర్వహించనున్న సిద్ధం మహాసభకు 15 లక్షల మంది వరకు హాజరవుతారని, కావలి నుంచి భారీ సంఖ్యలో సభకు తరలుతున్నట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి చెప్పారు. కావలిలోని తన నివాసంలో శనివారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నిర్వహిస్తున్న ఒక సిద్ధం సభను మించి మరో సిద్ధం సభ జరుగుతుంటే.. ప్రతిపక్షాల్లో వణుకుపుడుతుందన్నారు. కావలి నుంచి ఉదయం తొమ్మిది గంటలకు బయలుదేరి 11 గంటలకు సభాస్థలికి కార్యకర్తలు చేరుకునే విధంగా బస్సులు సిద్ధం చేసినట్లు చెప్పారు. భారీ ఎత్తున జనాలు రానుండడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకముందే సభాస్థలికి చేరుకునేలా ఉదయం తొమ్మిది గంటలకే బయలుదేరాలన్నారు. నియోజకవర్గంలో ప్రతి మండలంలో కార్యకర్తలు తరలివచ్చేందుకు వీలుగా బస్సులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నాయకులంతా అప్రమత్తంగా ఉండి సభకు తరలివచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. రాష్ట్రంలో ఉన్న అన్ని పార్టీలు ఒక్కటై పేదల పక్షాన ఒంటరిగా ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై చేస్తున్న రాజకీయ దాడులను ప్రజలు ముక్తకంఠంతో తిప్పి కొట్టాలని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అరాచక శక్తులను అడ్డుకోవాలి

కావలి నియోజకవర్గంలో అరాచక శక్తులు ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలను అడ్డుపెట్టుకుని పేట్రేగిపోవడానికి ప్రయత్నిస్తున్నాయని ఎమ్మెల్యే చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రశాంతంగా ఉండే కావలిలో ప్రజలను భయపెట్టి లొంగదీసుకోవాలనే దుర్మార్గుల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. అరాచకశక్తులను ప్రాథమిక దశలోనే ధైర్యంగా ఎదుర్కోలేపోతే వారు బలపడితే భావితరాల జీవితాలను చిదిమేస్తారన్నారు. అహంకారంతో విర్రవీగే దుర్మార్గులు నోటికి వచ్చిన నీచమైన మాటలతో దుష్ప్రచారం చేస్తారని, వారి మాయమాటలు నమ్మొద్దని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కావలి ప్రజల మనోభావాలు, ఆకాంక్షలు, ఆశలపై తనకు అపారమైన గౌరవం, నమ్మకం ఉందన్నారు. తన పోరాటం కూడా ప్రజల ఆత్మాభిమానం ఎక్కడా దెబ్బతినకుండా కాపాడాలనే లక్ష్యంతో పని చేస్తున్నానని, అందుకు ప్రజలు తనకు సహకరించాలన్నారు.

సిద్ధం సభకు సర్వసన్నద్ధం

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: బాపట్ల జిల్లా మేదరమెట్లలో ఆదివారం జరిగే సిద్ధం సభకు తరలివెళ్లేందుకు సర్వం సన్నద్ధంగా ఉన్నట్లు ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన దుత్తలూరు లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం సిద్ధం సభకు వెళ్లడంపై నియోజకవర్గ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఇంత వరకు జరగని విధంగా సిద్ధం సభ నిర్వహిస్తున్నందున పది వేల మంది ముఖ్య నేతలు, కార్యకర్తలు హాజరవుతారని తెలిపారు. సభకు వచ్చే కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గం నుంచి 200 బస్సులు, 100 కార్లలో కార్యకర్తలు, నేతలు బయలు దేరుతున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం అన్నారు. జాతీయ సర్వే సంస్థలు అన్నింట్లో కూడా వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరినందున, మళ్లీ జగన్‌ను సీఎంగా చేసుకోవాలని ఉత్సాహంతో ఉన్నట్లు చెప్పారు. ముఖ్యంగా మహిళలు ప్రభుత్వానికి పూర్తి మద్దతుగా ఉన్నట్లు చెప్పారు. ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా వైఎస్సార్‌సీపీకి వచ్చిన నష్టం ఏమి లేదన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతలు జి.ఓబులరెడ్డి, దుగ్గిరెడ్డి గురువారెడ్డి, చింతంరెడ్డి సుబ్బారెడ్డి, గణపం బాలకృష్ణారెడ్డి, పాలవెల్లి మాలకొండారెడ్డి, ఎల్‌పీ మాలకొండారెడ్డి, వాసుదేవరెడ్డి తదితరులు ఉన్నారు.



ముఖ్య నేతలతో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

టీడీపీని నమ్ముకుంటే నాశనమే

- పార్టీ వైఖరితో కార్యకర్తలు, నాయకులు తీవ్రంగా నష్టపోయారు

కావలి: టీడీపీని నమ్ముకుంటే నాశనం తప్పదని ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్‌సీపీలో చేరిన బాలకృష్ణ ఫ్యాన్స్ కావలి డివిజన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొగ్గవరపు శ్రీనివాసరావు (అన్నపూర్ణ శ్రీను), రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ద్రోణాదుల వెంకటరావు, కావలి పట్టణ టీడీపీ తెలుగు అధ్యక్షురాలుగా ఉండి వైఎస్సార్‌సీపీలో చేరిన ద్రోణాదుల వాసంతి, రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు దాసరి శివాజీ, అనురాధ అన్నారు. కావలిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ అవలంబిస్తున్న అనైతిక విధానాలు, పార్టీని నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలను ఏ విధంగా వాడుకుని వదిలేస్తుందో వివరించారు. బొగ్గవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ టీడీపీ విధానాలన్నీ అధికారం కోసమే తప్ప ప్రజల కోసం కాదని తెలిపారు. గత తొమ్మిది పర్యాయలుగా ప్రతి దఫా ఎన్నికలకు ఒక్కోసారి ఒక్కో అభ్యర్థిని నిలబెట్టి కార్యకర్తలను అయోమయంలోకి నెట్టిన ఘనత ఆ పార్టీకే దక్కుతుందన్నారు. ఎన్టీఆర్‌పై అభిమానంతో పార్టీలోకి వచ్చి 40 ఏళ్లుగా పార్టీ కోసం పని చేస్తున్న కార్యకర్తలు ఆ పార్టీ వైఖరితో పూర్తిగా నష్టపోయారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి కావలి ఎమ్మెల్యేగా మంచి వ్యక్తి, సౌమ్యుడైన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికే కేటాయిస్తూ ఆదర్శంగా నిలిచిందన్నారు. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు, అభిమానులకు ప్రతాప్‌కుమార్‌రెడ్డి అండగా నిలవడంతో పాటు వారి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తుండటంతో కార్యకర్తలు, అభిమానులు ఆయన వెంటే నడుస్తున్నారని తెలిపారు. ప్రతాప్‌కుమార్‌రెడ్డి అభిమానులను తమ వైపు లాక్కునేందుకు టీడీపీ ఎన్ని కుట్రలు పన్నినా ప్రలోభపడలేదన్నారు. డబ్బులు ఆశ చూపినా ఒక్కరూ కూడా ప్రతాప్‌కుమార్‌రెడ్డిని వీడి వెళ్లలేదన్నారు. ఆయన మంచితనం చూసే తాము కూడా టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి వచ్చినట్లు స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రతాప్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు. ద్రోణాదుల వెంకటరావు మాట్లాడుతూ టీడీపీ విధానాలు, కావలి అభ్యర్థిగా ఆ పార్టీ నియమించిన కావ్య కృష్ణారెడ్డి వైఖరి, నిర్లక్ష్యం భరించలేక వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. టీడీపీ చెప్పే మాటలకు, చేసే చేష్టలకు పొంతన ఉండదని తెలిపారు. బీసీల పార్టీగా చెప్పుకునే టీడీపీ పదవుల విషయంలోకి వచ్చే సరికి అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తుందని వివరించారు. బీసీలను నిలువునా మోసం చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. కావలిలో బీసీ భవన్ పెట్టి బీసీల కోసం పాటు పడుతుంటే సొంత పార్టీనే తప్పుడు కేసులు పెట్టించి వేధించిందని వివరించారు. బీసీలంతా ఏకమై తెలుగుదేశం పార్టీని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. దాసరి శివాజీ మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడలో సమున్నత స్థానంలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని పేద ప్రజలకు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీల్లోని దళితులను అన్ని రకాలుగా ఆదుకుంటున్నారన్నారు.



మాట్లాడుతున్న అన్నపూర్ణ శ్రీను, ద్రోణాదుల వెంకట్రావు, దాసరి శివాజీ

కాస్కోండి...

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించడానికి పెద్ద ఎత్తున వలసలు సిద్ధంగా ఉన్నాయని, అహంకారి అయిన కావ్య కృష్ణారెడ్డి కాస్కోవాలని అన్నపూర్ణ శ్రీను, ద్రోణాదుల వెంకట్రావు, దాసరి శివాజీ హెచ్చరించారు. రాన్ను రోజుల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలకే కావ్య కృష్ణారెడ్డి రాక్షస నైజం, నిజస్వరూపం తెలిస్తుందన్నారు.

లింగోద్భవ కాలంలో ఎమ్మెల్యే పూజలు



స్వామి వారికి పూజా సామగ్రి, నూతన వస్త్రాలు స్వయంగా తీసుకెళ్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



పల్లకి సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: మహాశివరాత్రి పండగను పురస్కరించుకుని శుక్రవారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో పట్టణంలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరాలయం, కాశీనాయన ఆశ్రమంలోని దుర్గామల్లేశ్వరాలయాల్లో లింగోద్భవ పూజలు నిర్వహించారు. శివాలయం అర్చకులు మేళ్లచెరువు శివకుమారశర్మ ఆధ్వర్యంలో స్వామివారి మూలవిరాట్‌కు అన్నాభిషేకం, అనంతరం వివిధ విశేష ద్రవ్యాలతో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించి తదుపరి లింగోద్భవ పూజలు చేశారు. స్వామి వారిని విశేషంగా అలంకరించారు. జాగారం చేస్తున్న భక్తులు వీక్షిస్తుండగా ఈ పూజలు అంగరంగ వైభవంగా జరిగాయి. కాశీనాయన ఆశ్రమంలోని దుర్గామల్లేశ్వర ఆలయంలో అర్ధరాత్రి లింగోద్భవ పూజల్లో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు. స్వామి వారికి పూజా ద్రవ్యాలను ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి స్వయంగా తీసుకెళ్లారు. అనంతరం చిన్నారులు, బాలికలు చేస్తున్న కోలాట వేడుకల్లో ఎమ్మెల్యే వారితో కలిసి కోలాటం చేశారు. అనంతరం స్వామి వారి పల్లకి సేవలో పాల్గొన్నారు. ఆయన వెంట పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, ఆత్మకూరు, ఏఎస్‌పేట ఎంపీపీలు కేతా వేణుగోపాల్ రెడ్డి, బోయిళ్ల పద్మజారెడ్డి, కేతా రవి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, వాసిపల్లి లక్ష్మీరెడ్డి, ఇందూరు రాజా, గడ్డం శ్రీనివాసులు రెడ్డి, కె కిషోర్, జమ్రు తదితరులు పాల్గొన్నారు.


మహాశివరాత్రి వేడుకలు



కల్యాణమహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అనుమసముద్రంపేట: మండలంలోని రాజవోలులో కొలువైన కాశీ అన్నపూర్ణేశ్వరి దేవస్థానంలో అంగరంగ వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చిట్టమూరు వెంకటరెడ్డి, సుగుణమ్మ దంపతులు, చిట్టమూరు వెంకటరెడ్డి, ముంగమూరు సుకేష్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, చిట్టమూరు నిరంజన్‌రెడ్డి, రామిరెడ్డి, శ్రీనివాసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

లింగోద్భవ కాలపూజ



కాశీ విశ్వేశ్వరుడికి పాలాభిషేకం

సంగం: మండలంలో శివరాత్రి సందర్భంగా శైవ క్షేత్రాల్లో శుక్రవారం అర్ధరాత్రి లింగోద్భవ పూజలు నిర్వహించారు. తిరుమనకొండలోని కాశీ విశ్వేశ్వరుడికి సకల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేక పూజలు చేశారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు నిర్వహించిన అభిషేకాన్ని భారీగా భక్తులు తిలకించారు. అనంతరం భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి మహా శివరాత్రి, లింగోద్భవ కాల విశిష్టను వివరించారు. సంగమేశ్వరస్వామి ఆలయం, స్థానిక అభయాంజనేయస్వామి, వంగల్లు, కొటేశ్వరస్వామి ఆలయాల్లో సైతం అర్ధరాత్రి లింగోద్భవ కాల పూజలు నిర్వహించారు.

వైభవంగా కోటేశ్వరస్వామి కల్యాణం

చేజర్ల: గంగ, కామాక్షి సమేత కోటేశ్వరస్వామి కల్యాణం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మండలంలోని కోటితీర్థంలో కొలువైన కోటేశ్వరస్వామి క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా అంగరంగ వైభవంగా కల్యాణం జరిగింది. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక పైకి స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చారు. అర్చకులు శాస్త్రోక్తంగా కన్యాదానం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కల్యాణాన్ని శుభ ముహూర్తంలో నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీలోకి గిరిజన జాగృతి ఐక్యవేదిక అధ్యక్షుడు

కావలి: నియోజకవర్గంలోని గిరిజనుల సమస్యలపై పోరాటం చేస్తున్న రాష్ట్ర గిరిజన జాగృతి ఐక్యవేదిక అధ్యక్షుడు, టీడీపీ నేత బాపట్ల వెంకటపతి కుటుంబంతో కలిసి శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెంకటపతి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాలకు భరోసా కల్పించేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితుడై పార్టీలో చేరినట్లు ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు.



బాపట్ల వెంకటపతి కుటుంబ సభ్యులతో పాటు ఇతర నాయకులతో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

సిద్ధం సభకు వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమరోత్సాహం

ఆత్మకూరురూరల్: బాపట్ల జిల్లా మేదరమెట్లలో ఆదివారం జరిగే సిద్ధం సభకు తరలివెళ్లేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సమరోత్సాహంతో సిద్ధమయ్యారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పిలుపు మేరకు మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో సిద్ధం సభకు శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేశారు. ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చిట్టమూరు జితేంద్రనాగ్‌రెడ్డి, తదితరులు ఈ మేరకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేశారు. అప్పారావుపాళెంలో సచివాలయ కన్వీనర్లు హజరత్‌నాయుడు, పూర్ణచంద్రరావు తదితరులు ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ఈ మేరకు సిద్ధం సభకు తరలిరావాలని లబ్ధిదారులు అందరిని ఆహ్వానించారు.



అప్పారావుపాళెంలో ప్రచారం నిర్వహిస్తున్న సచివాలయ కన్వీనర్లు

ప్రతి రైతు ఒక శాస్త్రవేత్త కావాలి

- జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవేణి

జలదంకి: ప్రభుత్వం అన్నదాతల కోసం అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుని ప్రతి రైతు ఒక శాస్త్రవేత్తగా తయారు కావాలని జిల్లా వ్యవసాయధికారిణి పి. సత్యవాణి అన్నారు. శనివారం మండలంలోని కృష్ణాపాడులో రైతు వాసిపల్లి పద్మనాభరెడ్డి పొలంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో క్షేత్ర దినోత్సవం కార్యక్రమం జరిగింది. జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి రైతు పొలాన్ని సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు పంటల సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధిస్తూ లాభాల బాటలో పయనించాలని సూచించారు. ప్రతి రైతు సాగు చేసిన పంట వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. వసాయ అధికారులు, సహాయకుల సూచనలు పాటించి పంటలు సాగు చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టి సాయం అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం వింజమూరు ఏడీఏ రామిరెడ్డి సేంద్రియ సాగు, పచ్చిరొట్ట ఎరువుల ఆవశ్యతక, ఈ–క్రాప్ నమోదు, సున్నా వడ్డీ పథకం, వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ పీడీ దొరసాని, ఆత్మ డీపీడీ జి.శివన్నారాయణ, ఏఓ బి. శైలజ, ఏఈఓ మునెమ్మ, జిల్లా ఉత్తమ రైతు అవార్డు గ్రహీత బోడిమండ్ల కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.



కృష్ణాపాడులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవేణి